కొవ్వొత్తి

సత్యనారాయణ, నీలాద్రి స్నేహితులు- మామూలు స్నేహితులు కాదు. ప్రాణ స్నేహితులు.

అయితే-

సత్యనారాయణ ఉత్తరం- నీలాద్రి దక్షిణం.

సత్యనారాయణ వెలుగు- నీలాద్రి చీకటి.

సత్యనారాయణ బ్రతుకు- నీలాద్రి చావు.

సత్యనారాయణకు చావంటే భయం లేదు. నీలాద్రి రోజూ చస్తూ ఉంటాడు.

సత్యనారాయణకు నిన్న గడిచిపోయిన దానిలో లెక్క- రేపసలే లేదు. అతనికి కావల్సింది ఈరోజు.

నీలాద్రి మాటలు... సలహాలు... అంటే సత్యనారాయణకు గురి...కాని ఆచరణలో పెట్టలేడు. వారానికి కనీసం మూడు సార్లైనా కలుసుకోవాలి ... మాట్లాడుకోవాలి... ప్రేయసీ ప్రియులల్లే ఒకరిని విడిచి ఒకరుండలేరు.

కాని—

నీలాద్రి చీకటినే వెదుకుతుంటాడు.

పేపరు చదువుతుంటే నీలాద్రికి... చావు సంగతులే కన్పిస్తాయి...ప్రమాదాలు...వ్యాధులూ... దుర్మరణాలూ ...విమానాలు కూలడం ... రైళ్ళు పట్టాలు తప్పడం... భూకంపాలూ...వరదలు... వానలు... ఒకటేమిటి... వెదికి

పెడితే మరీ చదువుతాడు. ఇలాంటివి. చదివి చలి జ్వరం వచ్చిన వాడల్లే వణుకుతూ ఉంటాడు. వాన చినుకులు తన మీద పడ్తే. ఎవరో బాణాల్తో కొట్టినట్టు... శూలాలతో పొడిచినట్టు ఉంటుంది...

సత్యనారాయణకు వాన చినుకులంటే సరదా. పన్నీరు చల్లినట్టుగా ఉంటుంది ... తడుస్తూ దద్దరిల్లిపోయేట్టు నవ్వుతాడు...

నీలాద్రికి. న్యుమోనియా. టెంపరేచర్. దగ్గు ముసుగు. మూలుగు. ఇవి వెంటాడుతూ ఉంటయ్, వర్షాన్ని తలుచుకున్నప్పుడు.

మరి—

ఇద్దర్లో ఎవరు గొప్ప. ఎవరు మనిషి. ఏం మనుషులు. ఎవరు పిరికి. ఏది నిజం. ఏదబద్ధం. ఎవరు నిర్ణయిస్తారు. మీరా. నేనా. సత్యనారాయణా. నీలాద్రా. ఇది వివేకమా, అవివేకమా. ఆదర్శమా. పుణ్యమా. పాపమా.

ఉండండి!

సత్యనారాయణకు సిగరెట్టన్నా. స్కాచ్ అన్నా ప్రాణం. ఎవరు ఎవరికి బానిసో తెలియదు సిగరెట్టుకు మాత్రం దాసుడు.

చదువుతున్న రోజుల్లో (చిన్నప్పుడు) నలుగురు స్నేహితులుండే వాళ్ళు...

వాళ్ళల్లో సీతా రామ్మూర్తి అనేవాడు తనలాగే బలాఢ్యుడు. ఉక్కు శరీరం. మిగతా వాళ్ళల్లో వాసు

అందంగా ఉండేవాడు. అందరూ ఇంచు మించు సమవయస్కులే వాసు డాక్టరయినాడు.

ఇప్పుడు—

అందరూ ఎక్కడెక్కడో ఉంటున్నారు. వయసు మాత్రం అందరికీ నలభై దాటింది. అప్పుడప్పుడు బాల్య స్నేహితులను తలచుకుంటూ ఉప్పొంగి పోయేవాడు.

ఆఫీసులో ఒక రోజు. ఓ సుముహూర్తాన సత్యనారాయణకు పిడుగులాంటి వార్త అందింది. ఓ కార్డు ముక్క.

"మా నాయన గారైన సీతా రామ్మూర్తిగారు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి కన్ను మూశారు. ఈ రోజు పెద్ద కర్మ..."

సీతారామ్మూర్తి చచ్చిపోయి. కొడుకుచేత ఆ ఉత్తరం వ్రాయించాడు.

ఆఫీసులో ఆ రోజు పని చెయ్యబుద్ధి పుట్టలేదు. సత్యనారాయణకు.

సీతారామ్మూర్తి టపాకాయ పేలినట్లు "ఢాం" అన్నాడు.

ఆ వార్త విన్న సత్యనారాయణకు - భయమా, దిగులా, దుఃఖమా. ఏవిటి? చచ్చిపోయిన సీతారామ్మూర్తి తన వయసు వాడు. ఉక్కు శరీరం. మరి గుండె పోటేమిటి? వెధవ గుండె. ఉన్నట్టుండి ఆగిపోతుంది చెప్పా చెయ్యకుండా ఆగిపోతున్నాను జాగ్రత్త. అని వార్నింగ్ అయినా ఇవ్వదు. ఇస్తే మాత్రం చేసేదేముంది. తన గుండెకూడా ఆగిపోదు

కదా. ఆగదు. ఆగదుగాక ఆగదు. ఆగితే గుండెను చంపేస్తాడు. పేల్చి విప్పి చేస్తాడు. అంత కోపం గుండెమీద. తనది గుండె గాదు. గుర్రం. వడి, గుర్రంకాదు జాతి గుర్రం. రేసు గుర్రం. అదిలిస్తే. వేగాన్ని అందుకుంటుంది. అది తెల్ల గుర్రం. తను నల్ల మనిషి.

మర్నాటి సాయంత్రం నీలాద్రిని కలుసుకున్నాడు. నీలాద్రి మాట్లాడుతున్నాడు. చీకటి మాటలు.

"ఏరా సత్యం!... రోజులు ఏం బాగా లేవురా. మా మేనమామ ఇటీవల బ్లడ్ ప్రషర్ ఎక్కువై ... కన్ను మూసేడు."

"ఒరేయ్. ఇలాంటి వార్తలు చెప్పకు. ఇవ్వాళ పేపరో చూశావా పెర్సీ హోటల్లో డాన్స ప్రోగ్రామ్ ఉంది. క్యాండిల్ లైట్ డాన్స్. రీటా. ఒరేయ్. రీటారా. రీటా. ఈ ఫోటో చూడు పేపర్లో"

"అదికాదురా. కేన్సర్‌ను గురించి ఓ స్పెషల్ వ్యాసం ఉంది చూశావా. సిగరెట్లకు. దానికి లంకె ఉందిట"

"ఒరేయ్. ఆపరా ఆపు. నీ ఉపన్యాసం. పెర్సీకి పోదాం పద"

"బాబూ. నీకూ నీ పెద్దలకు ఓ నమస్కారం. ఈ ప్రోగ్రామ్‌లు పెట్టకు. నిద్ర ఉండదు. ఆరోగ్యం చెడిపోతుంది"

"అంత పాడైపోయే ఆరోగ్యం ఎన్నాళ్ళుంటుందిరా. అంతగా చస్తే రేపటికి రెండు జనాభాలో ఎంతవుంది

చావడంలేదు గనుక... ఏనాటికైనా మట్టిలో కలిసిపో వల్సిందేగా..."

బలవంతాన నీలాద్రి సత్యనారాయణను అనుస రించాడు, బలికి వెళ్తున్న మేకలాగా...

సత్యనారాయణ గ్లాసు నింపుతున్నాడు. పెళ్ళి గుర్రం పరుగెడుతోంది గుండె అదిరేట్టుగా... కళ్ళెంలాగుదామంటే ఆగడంలేదు.

"ఒరేయ్... సత్యం... ఈ తాగడానికైనా మితం ఉండద్దురా...ఇప్పటికి మూడు పూర్తి చేశావ్, ఇది నాలు గోది...ఈ ద్రావకం లోపల దహించి వేస్తుందిరా...నీ ఆయుస్సు ప్రతి గ్లాసుకూ కొంత తగ్గిపోతుందిరా, నీవు తాగే ప్రతి సిగరెట్టూ... ఊపిరితిత్తులను...అంగుళం... అంగుళం తూట్లు పడేస్తుందిరా...నీవిక ఎక్కువ రోజులు బ్రతకవురా"

నీలాద్రి మాటలో నిజం ఉందా లేదా, అది వేరే సంగతి. అది నిజమని సత్యనారాయణకు తెలుసు, నీలాద్రి చెప్తూనే ఉంటాడు. సత్యనారాయణ వింటూనే ఉంటాడు. నీలాద్రి అలా చెప్పకపోతే సత్యనారాయణ హుషారు లేదు.

"నాలుగు వేదాలూ క్షుణ్ణంగా చదవాలిరా. ఉపనిష త్తుల మాటకేం గానీ" అంటూ సత్యనారాయణ అగ్ని హోత్రాన్ని అదలించాడు. అగ్ని స్వాహా దేవిని ఆవాహించు కున్నాడు. "ఈ హవిస్సు లందుకున్నవాళ్ళు పుణ్యాత్ములు. ఊర్వశీ. రంభా ఉంచుకున్న ఇంద్రుణ్ణి వదిలి పెట్టి, ఛీ పో

అని నెట్టేస్తూ పరుగెత్తుకొస్తారు ఆ దేవతలకు మనుషులంటే మహాప్రాణంరా" ఇదీ సత్యనారాయణ ధోరణి.

సత్యనారాయణ ఇక మారడు.

నీలాద్రి చెప్పడం మానడు.

మరి కొన్నాళ్ళకు సత్యనారాయణ ఓ వార్త అందింది. వాసు అంటే ఇప్పుడు డాక్టరు హఠాత్తుగా ఏదో జబ్బు చేస్తే హాస్పటల్లో చేర్చారు. ఏ క్షణాన్నయినా కన్ను మూయ వచ్చు.

రెండు రోజులు ఆలోచించాడు. పోయిచూసివస్తే బావుండుననుకున్నాడు. అక్కడికి వెళ్తే కనపడే దృశ్యం ఊహించుకున్నాడు. వ్యాధులు, రోగులు, డాక్టర్లు, మంచాలు, ఆస్పత్రి, డెట్టాల్ వాసన, ఆస్పత్రి వాసన, టోపీలు పెట్టుకున్న మగ నర్సులు, చలాకీగా పరుగెత్తుతున్న ఆడనర్సులు.

పోవడానికి మనస్కరించలేదు. అది భయమా, అస హ్యమా, పిరికితనమా, ఏమో మరి. సత్యనారాయణ వెళ్ళ లేదు. నీలాద్రికి చెప్పలేదు.

ఒకరోజు నీలాద్రి రొప్పుకుంటూ, యుద్ధంలో ఎవరో తరిమి కొడ్తే పారిపోయినట్లుగా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఒరేయ్ సత్యం నాకో భయంకరమైన కల వచ్చిం దిరా నేను చచ్చిపోయాన్రా, నా శవం త్వరగా కాల్చాలని అంటూ మహా ఆదుర్దా పడుతున్నారు. కొరివి అంటించారు. స్మశానంలోంచి అమాంతం లేచి కూర్చుని పెద్దగా అరిచాను.

నా శవం చాలా అసహ్యంగా ఉందిరా, కుళ్ళు వాసన కూడా ఆ వాసన భరించలేక పోయినాను. తెల్లవారింది అది అదృష్ట వశాత్తు కల కాబట్టి సరిపోయింది గానీ, తెల్లవారే వరకూ అది నిజంగానే తోచింది. కలలో చచ్చిపోయినా, బతికి పోయాను" మాటలు చెప్తూ వణుకుతున్నాడు.

"ఇది శుభసూచన నీకేం ఫర్వాలేదు. ఎవరికో మూడిందన్నమాట మీ బాబాయో, బావో, మరి ఎవరో."

ఇద్దరూ అబిడ్స్ వైపు నడచి వెళ్తున్నారు. చీకటి పడింది. అబిడ్స్ అంతా సందడిగా ఉంది.

వచ్చేపోయే కార్లు, రిక్షాలూ, స్కూటర్లూ, జంటలు, లైట్లూ జన సమర్థం రద్దీ పరుగు అందమయిన అమ్మాయిల నడకా.

"నీలూ అబిడ్స్ భూలోక స్వర్గం రా..." అన్నాడు సత్యం.

ఇంతలో ఎక్కడో కారు సడన్‌గా ఆగిన "క్రీక్" అనే చప్పుడు.

"ఒరేయ్ సత్యం ఎవరో కారు కిందపడి చచ్చేడ్రా ఇంటి దగ్గర చెప్పి వచ్చేడో లేదో" అన్నాడు నీలాద్రి.

"ఏమీలేదు ట్రాఫిక్ జామ్‌కా వస్తూ వస్తున్నకారు ఎర్రలైటు చూసి ఆగిపోయింది అంతే."

పేవ్‌మెంటు మీద నడుస్తున్నా నీలాద్రికి భయంగానే

ఉంది. ఒక వేళ ఏదైనా కారుగానీ, బస్సుగానీ దోవతప్పి పేవ్‌మెంటు మీదికి వస్తే పక్కకు పక్కకు జరిగి జరిగి నడుస్తున్నాడు.

ఎప్పటికైనా అలాంటి విపత్తు తప్పదనుకున్నాడు నీలాద్రి.

♦ ♦ ♦

తెల్లవారక తప్పదు, అందుకనే తెల్లవారింది.

ప్రతిరోజూ చూసుకుండే అద్దంలో సత్యనారాయణ తన ముఖం చూసుకున్నాడు.

అద్దంలో ముఖం నీరసంగా ఉంది. కళ్ళు లోతుకు పోయినై. జ్యోతుల్లా ఎర్రగా ఉన్నాయి. కళ్ళక్రింద నల్లటి చారలు.

చచ్చిపోయిన సీతారామ్మూర్తి అతని వెనకాల వస్తూ కన్పించారు అద్దంలో, నీ వెప్పుడు వస్తావురా మాతో అంటున్నారు. అద్దంలో సత్యనారాయణ ముఖం.

అద్దం—మనిషిలా! మనిషి మనసులా నిజాన్ని దాచలేదు. మనిషిలో మనిషో మరి.

“ఏడిశారు, వీళ్ళతోనా నే వెళ్ళేది” అనుకున్నాడు.

భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళేడు. ఆఫీసులో పని సాగలేదు. కొంచెం పైత్యంగా ఉండి కళ్ళు తిరిగినట్లయింది.

పెందలాడే ఆఫీసు వదలి బయట పడ్డాడు.

మామూలుగా బార్ ఆహ్వానించింది.

ఏ ఆహ్వానాన్నీ ఎప్పుడూ తిరస్కరించలేదు తన

పక్కన నీలాద్రి లేనిలోటు కన్పించింది. నీలాద్రి వస్తే బాగుండును అనుకున్నాడు. నీలాద్రి బోధలు వింటుంటే సరదాగా ఉంటుంది. నిజాన్ని గట్టిగా చెప్పగలడు.

గుర్రాల పరుగు అయిపోయింది. గుండె గడియారం వేగంగానే కొట్టుకుంటున్నది.

బయట పడ్డాడు బార్లోంచి.

తననెరిగి ఉన్న రిక్షావాడు కన్పడ్డాడు— సత్యనారాయణను ఎక్కడికి తీసుకు వెళ్ళాలో అతనికి తెలుసు.

తరువాత రెండు రోజులకు నీలాద్రి కన్పించాడు, వస్తూనే.

"ఏరా, సత్యం ఇదే అవతారంరా, రోజు రోజుకూ తీసిపోతున్నావ్, త్వరగా డాక్టర్ని చూస్తే మంచిది. ముఖం పాలిపోయి ఇవ్వాళో రేపో అన్నట్లు ఉన్నావురా" అన్నాడు.

ఇవి నీలాద్రి కుశల ప్రశ్నలు.

"డాక్టర్ని చూడడం అనవసరం. నేను బాగానే ఉన్నాను. వ్యాధి అంటూ లేకుండా ఎవడూ ఉండడు. వైద్యుడు ఎప్పుడూ ఏదో వ్యాధి ఉందనే అంటాడు. వ్యాధి ఉన్నా మనల్నేం చేస్తుంది" అని నవ్వుతూ అన్నాడు సత్యనారాయణ.

ఆ నవ్వు చాలా నీరసంగానూ భయంకరంగానూ ఉంది.

ఎంతమందికి ఎన్ని వ్యాధులున్నా ఏ వ్యాధి తన దాకా రాదు. సత్యనారాయణకు, ఎంతమంది చచ్చి

పోతున్నా, ఆ చావు తనదాకా రాదు. ఇది ధైర్యమా, బల హీనతా, పిరికితనమా, గొప్పగుణమా, ఏమో నీలాద్రికి తెలుసేమో, నీలాద్రికి సత్యనారాయణ సంగతి బాగా తెలుసు.

అద్దంమీద కోపం వచ్చింది. అద్దాన్ని తీసేశాడు. అద్దం లేకుండానే కాలం గడుపుతున్నాడు.

మామూలు అలవాట్లు మానలేదు.

ఎక్కువవుతున్న సిగరెట్లను తగ్గించలేదు.

రిక్షావాడి స్నేహం ఉండనే ఉంది.

నీలాద్రిని తప్పించుకు తిరుగుతున్నాడు అయినా ఎప్పుడో ఒకప్పుడు కనపడుతూనే చీకటిని గుర్తుచేస్తూనే ఉన్నాడు.

ఒకరోజున సత్యనారాయణ వేసిన ప్రశ్నకు నీలాద్రి అదిరిపడ్డాడు...

"ఓరేయ్ నీలూ నే చచ్చిపోతే ఏం చేస్తావురా" అది ప్రశ్న.

"అంతమాట అనకురా సత్యం, ఇలాంటి మాటలు మాట్లాడకు. నీవు లేంది నేను లేను. నేను నిన్ను చూసే బ్రతుకుతున్నాను. నీలో వెల్తురుంది" ఇది జవాబు.

♦ ♦ ♦

నాలుగు రోజుల తరువాత-

సత్యనారాయణ ఓ అమావాస్యనాడు ఆఫీసులో పని చేస్తుండగా రక్తం కక్కుకుని తాపీగా కన్నుమూశాడు. ఆ

కొవ్వు వత్తి కాలికాలి కాంతినిచ్చి హరించిపోయింది కర్పూరంలా...

నీలాద్రి ఇక కన్పడడు. మనకూ, సత్యనారాయణకు కూడా కన్పడదు అనుకున్న నీలాద్రి నాకోసారి కన్పించాడు.

"సత్యనారాయణ దేవుడు లాంటివాడు" అన్నాడు.

"అంటే నీ ఉద్దేశ్యం మంచివాడనా, గొప్పవాడనా, ఏవిటి?" అన్నాను.

"సత్యనారాయణకు ఆత్మహత్య మహాపాతకం అని తెలుసు అందుకే తాపీగా తనను తాను హత్య చేయించుకున్నాడు ఆనందంగా ఈ హత్యకు ఆయుధంలేదు. మనిషిలోని మనిషి హత్య చేశాడు. నాలుగేళ్ళగా అతని భార్య పోయినప్పటినుండీ అతనిలో పొంచి ఉన్నాడు.

"పొంచి ఉండి రోజూ కొంచెం కొంచెం చంపుతున్నాడు. సత్యనారాయణ భార్యను మరచిపోలేక మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. నేనెప్పుడూ అతని శరీరంతోనే మాట్లాడుతుండేవాణ్ణి" అన్నాడు నీలాద్రి.

నెమ్మదిగా సిగరెట్టు తీశాను వెలిగిద్దామని.

నీలాద్రిని చూసి ఆగాను.

సత్యనారాయణ నాకిప్పటికీ ఒక ప్రశ్నగానే ఉండిపోయాడు... !

... ౦౦౦ ...